# సింగిల్ పేజీ కథలు

## నిర్ణయం

"కరుణా..ప్లీజ్, భోజనానికి రామ్మా'' అనునయంగా అడిగాడు కృష్ణ.

''డాడీ, ప్లీజ్ నన్ను విసిగించకండి. మీరు నా మాట విననప్పుడు నేనెందుకు మీ మాట వినాలి?''

నిస్సహాయంగా చూసాడు కృష్ణ. ''నటనంటే నా ప్రాణమమ్మా? దాన్ని వదిలెయ్యమంటే ఎలా?''

''మీకు నేను కావాలా? నటించడం కావాలా?''

''నువ్వు, నటన, నాకు రెండు కళ్లమ్మా, మీ అమ్మ లేని లోటును నేను నటించడంలో జీవించడంతో మరిచిపోతాను''

''అదేమో నాకు తెలియదు. మా ఫ్రెండ్సంతా నన్ను గేలి చేస్తున్నారు''

''పోనీ, ఇక నుండి హీరోగా చెయ్యడం మానేసి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మాత్రమే నటిస్తా, దయ ఉంచి భోజనానికి రామ్మా''

అప్పటికి కరుణించింది కరుణ. భోజనం చేస్తున్న కరుణని తృప్తిగా చూసాడు కృష్ణ.

''కరుణా..నేనీ స్థితికి చేరుకోవడానికి ఎంత కష్టపడ్డానో తెలుసా? నాతోపాటు మీ అమ్మ కూడా. 'ఏమండీ..మీకు మంచి రూపముంది, నటించే కళ ఉంది. దాన్ని వృథాచెయ్యకండి' అనేది. 'నేను హీరోయిన్స్‌తో అంత క్లోజ్‌గా ఉంటుంటే నీకు బాధగా ఉంటుందేమో, పోనీ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా యాక్ట్ చెయ్యనా?' అనడిగితే మీ అమ్మ ఏమందో తెలుసా? 'క్యారెక్టర్ ఆర్టిస్ట్ అయితే హీరో కంటే తక్కువగా ఎలివేట్ చేస్తారు మిమ్మల్ని. అది నాకు ఇష్టం లేదు' అంది'' అన్నాడు కృష్ణ. కరుణ వంక ఆశగా చూశాడు. ''పోన్లే నాన్నా, మీకిష్టమైనట్టు మీరు నటించండి'' అని అంటుందేమోనని. కానీ కరుణ భోజనం దగ్గర్నుండి లేచి రూంలోకి వెళ్లిపోయింది విసురుగా.

కాలేజీకెళ్లింది కరుణ అన్యమనస్కంగా. డాడీని ఇలాంటి కోరిక కోరి అప్‌సెట్ చేసానా అనుకుంది ఒక్కక్షణం. మళ్లీ మామూలైపోయి స్నేహితురాళ్లతో డిస్కషన్‌లో పడింది.

సాయంత్రం సుధీర్‌ని కలిసింది. ''ఏంటి కరుణా, మీ డాడీ ఇలాంటి నిర్ణయం తీసుకున్నారు?'' అనడిగాడు ఆశ్చర్యంగా.

''ఏ విషయం గురించి?''

''హీరోగా పీక్ పాయింట్‌లో ఉండి, హీరోగా రిటైర్ అయిపోయి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేస్తాననడం బాగుందా?''

''అప్పుడే ఈ విషయం నీదాకా వచ్చిందా?''



ఆశ్చర్యంగా అడిగింది కరుణ సుధీర్‌ని.

''భలేదానివే నువ్వు. ఫేమ్‌లో ఉన్న వ్యక్తి తుమ్మినా, దగ్గినా సంచలనమే తెలుసా?''

''మా డాడీ ఈవిధమైన నిర్ణయం తీసుకోవడానికి కారణం నేనే. మా ఫ్రెండ్సంతా- 'చూడు మీ డాడీ ఎలా స్టెప్పులు వేస్తున్నాడో, చూడు చూడు హీరోయిన్ని ఎలా టీజ్ చేస్తున్నాడో' అని ఒకటే హేళన. అదే క్యారెక్టర్ ఆర్టిస్ట్ అయితే ఇలాంటి సిట్యుయేషన్స్ ఉండవుగా!''

''హీరోకి ఉన్న పేరు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌కి వస్తుందంటావా?''

''అందుకే నేను ఈ గోలంతా ఎందుకు, నటించడం మానెయ్యి డాడీ అన్నాను'' అంది కరుణ విసుగ్గా సుధీర్‌తో.

''నువ్వు కూతురుగా పుట్టినందుకు ఆయన చాలా దురదృష్టవంతుడు'' పదే పదే అన్నాడు సుధీర్.

''ఎందుకు?'' ఉక్రోషంగా అంది కరుణ.

మొన్న స్లిప్‌టెస్ట్లులో నీకు ఏభైకి ఏభైమార్కులు రావాల్సి ఉంటే పొరపాటున నలభై ఎనిమిది వేసారని లెక్చరర్‌తో అప్పటికప్పుడే వాదన పెట్టుకుని మార్కులు సరిచేయించుకున్నావ్. ఆ స్లిప్‌టెస్టేమీ నీ లైఫ్‌ని నిర్దేశించేది కాదు. దానివల్ల నీకు ఆవగింజంత నష్టం లేదు. అయినా నీ గొప్ప నీక్కావాలి. అదేవిధంగా హీరో లక్షణాలున్న వ్యక్తి ఒక మెట్టు దిగి ఇంకో చిన్న ఆర్టిస్ట్‌గా చెయ్యడానికి ఒప్పుకున్న మీ డాడీ మనసుకి సంతృప్తి వద్దా?''

వింటున్న కరుణ మనసులో అంతర్మథనం మొదలైంది.

''పూర్ ఫ్రెండ్స్. మీ డాడీకున్న పేరు ప్రతిష్టలు వాళ్ల పేరెంట్స్‌కి లేవని ఏవేవో ఎక్కించి నీ మనసుని పాడుచేసారు. స్లిప్‌టెస్ట్‌లానే ఈ ఫ్రెండ్సేమీ శాశ్వతం కాదు. మీ డాడీ కెరీరే నీకు చాలా ముఖ్యం కరుణా. నటనలో పరిణతి ఉన్న వ్యక్తిని క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ప్రెజెంట్ చెయ్యడం ఇష్టం ఉండదు డైరెక్టర్స్‌కి. అప్పుడు ఆటోమేటిక్‌గా మీ నాన్న రెంటికీ చెడ్డ రేవడి అవుతాడు తెలుసా?'' ఉద్వేగంగా అన్నాడు సుధీర్.

''నిజం సుధీర్. నేనెంత తప్పు చేసానో నాకిప్పుడర్థమవుతోంది. నలభై ఏళ్లకే డాడీకి కెరీర్ లేకపోవడం ఊహించుకోవడానికే భయంకరంగా వుంది. పద త్వరగా డాడీ వద్దకెళ్లి సారీ చెప్పుకోవాలి. డాడీ పెట్టబోయే ప్రెస్‌మీట్‌ను ఆపాలి'' అంది కరుణ ఉద్విగ్నంగా.

''కరుణా ఈజ్ ఎ గుడ్‌గర్ల్'' మెచ్చుకున్నాడు సుధీర్.

''ఎందుకు తప్పు చేసినందుకా?''

''కాదు. చేసిన తప్పుని అతి త్వరగా దిద్దుకుంటున్నందుకు'' నవ్వుతూ అంటున్న సుధీర్ నవ్వుతో తనూ జత కలిపింది కరుణ.

''మీ డాడీ నీకు భర్తగా నన్ను సెలెక్ట్ చేశాడు. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. ఆయన ఉన్నతస్థితిలో ఉండాలన్నదే మనం ఎప్పటికీ కోరుకోవాల్సింది కరుణా''

''సారీ సుధీర్, డాడీని ఇక ఎప్పుడూ ఏ విషయానికీ బాధపెట్టను. ఇట్స్ మై ప్రామిస్'' అంటున్న కరుణ వైపు ప్రేమగా చూశాడు సుధీర్.

**-కె. లలితారాజ్ (ఒంగోలు)**